నేడు పింఛన్ల పంపిణీ

● కొత్తగా 292 మందికి మంజూరు

విజయనగరం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సామాజిక పెన్షన్ పొందుతున్న వారికి ఒక్క రోజు ముందే (డిసెంబరు 31) పెన్షన్ పంపిణీ చేసేందుకు డీఆర్‌డీఏ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. జిల్లా వ్యాప్తంగా 2 లక్షల 75 వేల 379 మంది పెన్షన్‌దారులకు రూ.115 కోట్ల 63 లక్షల మొత్తాన్ని వారి ఇళ్ల వద్దకు వెళ్లి అందజేస్తామని కలెక్టర్ అంబేడ్కర్ తెలిపారు. ఈ నెల నుంచి స్పౌజ్ కేటగిరీ కింద భర్త లేని భార్యకు మంజూరు చేశామని, ఆ విధంగా కొత్త వారు 292 మందికి పింఛన్ అందజేస్తామని తెలిపారు.

321 మందే హాజరు

● కానిస్టేబుల్ నియామక ప్రక్రియ ప్రారంభం
● తొలి రోజు 600 మందికి పిలుపు

విజయనగరం క్రైం, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): పోలీసు కానిస్టేబుల్ ఉద్యోగ నియామకాల ప్రక్రియకు తొలిరోజు 321 మంది మాత్రమే హాజరయ్యారు. ప్రాథమిక రాత పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులకు సోమవారం నుంచి జిల్లా పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో పీఎంటీ, పీఈటీ పరీక్షల ప్రక్రియ ప్రారంభమైంది. 600 మంది అభ్యర్థులు హాజరుకావాల్సి వుండగా, 321 మంది మాత్రమే హాజరయ్యారు. ఉదయం 4 గంటలకు ప్రక్రియ ప్రారంభించారు. ఎస్పీ వకుల్‌జిందాల్ పర్యవేక్షించారు. తొలుత అభ్యర్థుల హాల్ టిక్కెట్లు పరిశీలించి మైదానంలోకి అనుమతించారు. విద్యార్హతలు, రిజర్వేషన్, వయసు నిర్ధారించే ధ్రువపత్రాలను పరిశీలించి అన్నీ సక్రమంగా ఉన్న వారికి మాత్రమే బయోమెట్రిక్ తీసుకుని పీఎంటీ పరీక్షలకు అనుమతించారు. డిజిటల్ ఎక్విప్‌మెంట్ వినియోగించి అభ్యర్థుల ఎత్తు, ఛాతి కొలతలు నిర్వహించారు. ప్రక్రియ పూర్తి పారదర్శకంగా నిష్పక్షపాతంగా సీసీ కెమెరాల పర్యవేక్షణలో జరుగుతోందని ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. ఏఎస్పీలు సౌమ్యలత, జి.నాగేశ్వరరావు, డీఎస్పీలు యూనివర్స్, వీరకుమార్, బాపూజీ, టీఎస్ శ్రీనివాసరావు, థామస్ రెడ్డి, ఏవో శ్రీనివాసరావు పాల్గొన్నారు.


పరుగు పరీక్షను పరిశీలిస్తున్న ఎస్పీ వకుల్‌జిందాల్

ఫ్రీహోల్డ్‌పై నోరెత్తలేదు!

● కేజీ పూడి అసైన్డ్ భూముల రైతుల్లో నిరాశ ● మొక్కుబడిగా రెవెన్యూ సదస్సు
● జాయింట్ పట్టా రైతుల్లో ఆందోళన ● ఇంకెవరికైనా రిజిస్ట్రేషన్ అయిందేమోనని ఆరా

వైసీపీ ప్రభుత్వంలో 2022 నుంచి 2024 వరకు వేపాడ తహసీల్దార్ కార్యాలయంలో పనిచేసిన అధికారులు రియల్ ఎస్టేట్ వ్యాపారులతో కుమ్మక్కయ్యారు. అసైన్డ్ ల్యాండ్ చట్టానికి వ్యతిరేకంగా 22(ఎ)లో ఉన్న భూములను ఫ్రీహోల్డ్ జీవోను అడ్డం పెట్టుకుని దారదత్తం చేశారు. వెంటవెంటనే ఆన్‌లైన్ చేసేశారు. 30 ఏళ్ల నుంచి సాగు చేసుకుంటున్న మా భూములకు మాత్రం మోక్షం లేదు. ఫ్రీహోల్డ్ వర్తింప చేయలేదు.
- వేపాడ మండలం కొండగంగుపూడికి చెందిన గిరిజన రైతుల ఆవేదన

రెండు కుటుంబాలకు కలిపి 4.97 ఎకరాలతో జాయింట్ పట్టాను ప్రభుత్వం గతంలో మంజూరు చేసింది. ఇరువురం చెరో సగం భూమిని సాగు చేస్తున్నాం. కొన్నాళ్ల కిందట నా భర్త చనిపోయాడు. జాయింట్ పట్టాను విడదీసి ప్రత్యేకంగా పట్టా ఇవ్వాలని పలుమార్లు రెవెన్యూ అధికారులకు దరఖాస్తు చేశాను. ఎవరూ పట్టించుకోలేదు. మా గ్రామంలోని భూములను పెద్దోళ్లు కొనుగోలు చేశారని, రిజిస్ట్రేషన్ అయిపోయాయని అంతా చెప్పుకుంటుండడంతో భయమేస్తోంది.
- ఓ గిరిజన మహిళా రైతు ఆవేదన


కేజీపూడి రెవెన్యూ సదస్సులో అర్జీలు స్వీకరిస్తున్న అధికారులు

శృంగవరపుకోట, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): వేపాడ మండలం కొండగంగుపూడి(కేజీపూడి) గ్రామ రెవెన్యూ సదస్సులో పలువురు గిరిజన రైతులు సోమవారం గోడు వెళ్లబుచ్చుకున్నారు. సదస్సులో ఫ్రీహోల్డ్ జరిగిన అసైన్డ్ భూముల వివరాలను బయటపెడతారని అందరూ ఎదురు చూశారు. కనీసం ఫ్రీహోల్డ్ భూములను కొనుగోలు చేసిన యజమానుల వివరాలైనా చెబుతారని ఆశించారు. గ్రామ రెవెన్యూ సదస్సులకు వచ్చిన అధికారులెవరూ వీటి గురించే నోరెత్తలేదు. అసైన్డ్ భూముల ఫ్రీహోల్డ్ వ్యవహారం రెవెన్యూ సదస్సుతో సంబంధం లేదన్న విధంగా ప్రవర్తించారు. గ్రామస్థులు ఇచ్చిన అర్జీలను స్వీకరించడమే పనిగా పెట్టుకున్నారు. దీంతో స్థానికులు తీవ్ర నిరాశ పడ్డారు.

వాస్తవానికి కేజీపూడి గ్రామానికి చెందిన ఫ్రీహోల్డ్ భూముల వ్యవహారం రాష్ట్ర స్థాయిలో చర్చనీయాంశమైంది. శృంగవరపుకోట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో భూముల రిజిస్ట్రేషన్ జరగడంతో రాష్ట్ర భూ పరిపాలన శాఖ (సీసీఎల్ఏ) ముఖ్యకార్యదర్శి ఆర్‌పీ సిసోడియా ఆగస్టులో ప్రత్యేకంగా తనిఖీ చేశారు. రిజిస్ట్రేషన్ తంతులో జరిగిన అవకతవకలకు అప్పటి సబ్ రిజిస్ట్రార్‌ను బాధ్యుడిని చేశారు. అంతేకాకుండా ఈ భూముల ఫ్రీహోల్డ్ ప్రక్రియ నిబంధనల ప్రకారం జరిగిందో లేదో చూడాలని కలెక్టర్ బీ.ఆర్ అంబేడ్కర్, జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్‌లకు అప్పగించారు. ఆ తర్వాత తహసీల్దార్ కార్యాలయ అధికారులు పలుమార్లు రికార్డులను కలెక్టరేట్‌కు తీసుకెళ్లారు. జిల్లా ఉన్నతాధికారులు వాటిని పునఃపరిశీలించారు. ఇంతటి ప్రాముఖ్యత కలిగిన అంశాన్ని **మిగతా 6వ పేజీలో..**

రహదారులపై వేడుకలొద్దు

ఒంటి గంట తరువాత రోడ్లపై కన్పిస్తే చర్యలు: ఎస్పీ వకుల్‌జిందాల్

విజయనగరం క్రైం, డిసెంబరు30(ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సర వేడుకలను 31న రాత్రి రహదారుల పైనా, బహిరంగ ప్రదేశాల్లో నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ వకుల్ జిందాల్ హెచ్చరించారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మద్యం సేవించి వాహనం నడపవద్దని, తనిఖీల్లో పట్టుబడితే కేసులు నమోదు చేస్తామన్నారు. అతి వేగంగా వాహనం నడిపినా, బైకు రేసు నిర్వహించినా, ట్రిపుల్ డ్రైవింగ్‌తో పట్టుబడినా కేసులు నమోదు చేసి వాహనాలు సీజ్ చేస్తామని హెచ్చరించారు. డీజె, లౌడ్ స్పీకర్‌లతో పెద్ద శబ్దం చేస్తూ ప్రజలకు ఇబ్బంది కలిగిస్తే ఊరుకునేది లేదన్నారు. బహిరంగ ప్రదేశాల్లో నృత్యాలు చేయడం, పార్టీలు నిర్వహించడం, కేక్‌లు కట్ చేయడం అనుమ తించబోమన్నారు.

ప్రభుత్వం నిర్దేశించిన సమయం వరకూ మాత్రమే మద్యం విక్రయాలు జరపాలన్నారు. నిబంధనలు ఉల్లంఘించే మద్యం షాపులు, బార్లపైనా చర్యలు తప్పవన్నారు. రాత్రి గస్తీని ముమ్మరం చేస్తామని, ముఖ్య కూడళ్లో పోలీసు పికెట్ ఏర్పాటు చేస్తామని తెలిపారు.

ఆంధ్రజ్యోతి


కార్ అండ్ బైక్ రేస్

డిసెంబర్ నెల కూపన్ నంబర్ - 3

పాఠకుని పూర్తి పేరు : ....
డోర్ నెంబరు : ....
వీధి పేరు : ....
గ్రామం / పట్టణం : ....
మండలం : ....
జిల్లా : ....
పోస్టల్ పిన్‌కోడ్ : ....
ఫోన్ నంబర్ : ....

నాలుగు నెలల్లో ఆంధ్రజ్యోతి డ్రాలో ఇది డిసెంబర్ నెల మూడవ కూపన్ ఈ కూపన్‌లో మీ అడ్రస్ పూర్తి చేసి ఈ నెలలో ఇచ్చే మూడు కూపన్లను ఒక సెట్‌గా చేసి మీ వద్దనే ఉంచి మూడు నెలలు అయిన తర్వాత మొత్తం 9 కూపన్లను మూడు సెట్లుగా చేసి 2025 మార్చ్ నెల 10వ తేది నాటికి ఈ క్రింది అడ్రస్‌కు పోస్ట్ ద్వారా కాని, స్వయంగా కాని అందచేయవలెను.



నోట్ : సెట్‌గా కాకుండా విడిగా పంపిన కూపన్లు చెల్లవు.
* చట్ట ప్రకారం నిబంధనలు వర్తించును.

కూపన్లు పంపవలసిన చిరునామా
ఆంధ్రజ్యోతి, ఎచ్చెర్ల గ్రామం, శ్రీకాకుళం- 532410,
ఎ.సి.ఎం.: 9985411514,
బి.యమ్.: 9985411523


మెరకముడిదాం మండలం బైరిపురం గోదాములో బియ్యం బస్తాలకు రంధ్రం చేస్తున్న దృశ్యం

బియ్యం బొక్కేస్తున్నారు

● గోదాంకు చేరగానే బస్తాల నుంచి కాజేస్తున్న వైనం

విజయనగరం, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): పేదలకు అందాల్సిన బియ్యం చోరీ అవుతున్నాయి. అందుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గిడ్డంగుల సంస్థ గోదాములే వేదికగా మారాయి. సిబ్బందే అక్రమాలకు పాల్పడుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. కాజేసిన బియ్యాన్ని పక్కదారి పట్టిస్తూ రెండు చేతులా సంపాదిస్తున్నారు. ఆ అక్రమ సంపాదనలో పౌర సరఫరాల శాఖ అధికారులకు వాటాలు అందుతున్నాయన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. రైస్ మిల్లుల నుంచి బియ్యం లారీల్లో జిల్లాలోని సివిల్ సప్లయ్ శాఖ గోదాములకు చేరుకోగానే అక్కడి సిబ్బంది అన్‌లోడింగ్ చేస్తారు. ఆ సమయంలోనే బస్తాలకు రంధ్రాలు చేసి ఒక్కో బస్తా నుంచి 2 నుంచి 3 కేజీల బియ్యాన్ని కాజేస్తున్నారని తెలిసింది. మెరకముడిదాం మండలం బైరిపురం **మిగతా 6వ పేజీలో..**

సైబర్ ఉచ్చులో మరొకరు



● రుణం ఇస్తామని ఆశ పెట్టి మూడు రోజుల్లో రూ.8.95 లక్షలు స్వాహా
● లబోదిబోమంటున్న బాధితుడు

రాజాం రూరల్, డిసెంబర్ 30(ఆంధ్రజ్యోతి): నిత్యం ఏదో ఒకచోట ఎవరో ఒకరు ఆన్‌లైన్ మోసాలకు బలవుతూ ఆర్థికంగా నష్టపోతున్నా.. ప్రజల్లో అవగాహన పెరగడం లేదు. సైబర్ నేరగాళ్లు ఏయే రకాలుగా ప్రజల్ని మోసం చేస్తున్నారో పోలీసులు విస్తృతంగా ప్రచారం చేస్తున్నా వారి బారినపడి చేతులు కాల్చుకుంటున్న వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. తక్కువ సమయంలో ఎక్కువ మొత్తం ఆర్జించాలన్న దురాశ కొందరిది కాగా, ముక్కు మొహం తెలియని వారు గంటలో రుణాలిస్తామని చెబితే నమ్మి నట్టేట మునిగినవారు మరికొందరు. తాజాగా రాజాంకు చెందిన ఓ వ్యక్తి సైబర్ నేరగాళ్ల మాయలో పడి రూ.8.95 లక్షలు **మిగతా 6వ పేజీలో..**

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటర్ల జాబితా విడుదల

5లో

● ఆరు జిల్లాల్లో 21,555 మంది ఓటర్లు
● అత్యధికంగా విశాఖలో 5,277 మంది ఓటర్లు

బంపర్ ఆఫర్

● మార్కెట్‌లో డిస్కౌంట్ల సందడి
● కొనుగోలుదారులను ఆకట్టుకుంటున్న వ్యాపారులు

4లో

బంపర్.. ఆఫర్!

- మార్కెట్‌లో డిస్కౌంట్ల సందడి
- కొనుగోలుదారులను ఆకట్టుకుంటున్న వ్యాపారులు
- ఇప్పటికే మొదలైన పండగ వ్యాపారం
- నాణ్యతను చూడాలంటున్న నిపుణులు

సాధారణంగా సంక్రాంతి సందడి జనవరి మొదటి వారం నుంచి మొదలవుతుంది. కానీ వ్యాపారులకు మాత్రం ఓ నెల ముందే ప్రారంభమవుతుంది. క్రిస్మస్ కొనుగోళ్లు డిసెంబరులో ప్రారంభమవుతాయి. దీంతో వస్తు, వస్త్ర వ్యాపారాలు ఊపందుకుంటాయి. ముఖ్యంగా వివిధ వ్యాపార సంస్థలు ఆఫర్లతో ప్రజలను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తుంటాయి. ఉచితం అంటూ ఊరిస్తాయి. దీనికి ఉండే ఆకర్షణ శక్తి అలాంటిదే. అందుకే జనం అటువైపు చూస్తుంటారు. ఆఫర్లతో పాటు నాణ్యతనూ గుర్తించాలని నిపుణులు చెబుతున్నారు.





కొనుగోలుదారులతో కిటకిటలాడుతున్న ఓ షాపింగ్ మాల్

విజయనగరం/ గజపతినగరం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఒకటి కొంటే మరొకటి ఫ్రీ. రెండు కొంటే మూడోది ఫ్రీ. పండుగ క్లియరెన్స్ సేల్. భారీ ఆఫర్లు.. కళ్లు చెదిరే రాయితీలు.. విజయనగరంలో ఏ మూల చూసినా ఇవే ప్రకటనలు. ఆటోలు, ద్విచక్ర వాహనాల్లో ఇదే ప్రచారంతో హోరెత్తిస్తున్నారు. ఇవి సాధారణ, మధ్య తరగతి వారితో పాటు ఉన్నత వర్గాలనూ ఆకర్షిస్తున్నాయి. ఆఫర్ల గురించి ఆలోచించేలా చేస్తున్నాయి. ఎక్కడ తమకు అనుకూలంగా ఉంటున్నాయో నిర్ణయించుకునే వెసులుబాటును కల్పిస్తున్నాయి.

అతి పెద్ద మార్కెట్..

ఉత్తరాంధ్రలో అతిపెద్ద వస్త్ర వ్యాపార కేంద్రం విజయనగరం. ఉత్తరాంధ్రతో పాటు ఛత్తీస్‌గఢ్, ఒడిశాల వ్యాపారం కూడా విజయనగరంతోనే ముడిపడి ఉంది. ఉల్లి వీధి, రైల్వేస్టేషన్ రోడ్డు, ఆర్టీసీ కాంప్లెక్స్ రోడ్డు, బాలాజీ జంక్షన్ నుంచి మార్కెట్ వరకూ వందలాది వ్యాపార సంస్థల సమాహారం విజయనగరం. వివాహాలు, ఇతర శుభకార్యాల వస్త్రాలకు పెట్టింది పేరు. ఉత్తరాంధ్ర ప్రజల ఇంట్లో ఏ చిన్న కార్యక్రమమైనా షాపింగ్ కోసం ముందుగా ఎంచుకునేది విజయనగరాన్నే. క్రిస్మస్, సంక్రాంతి లాంటి పండగలు వచ్చాయంటే చాలు.. ఇక్కడ మార్కెట్‌లో ఆఫర్లతో సందడి మొదలవుతుంది. ఉత్తరాంధ్ర ప్రజలకు సంక్రాంతి పండగ అత్యంత ముఖ్యమైనది. దీంతో షాపింగ్ అదే స్థాయిలో జరుగుతుంది. వ్యాపారమూ అంతే స్థాయిలో ఉంటుంది.

అసలు స్టిక్కర్లు ఉండవు

వస్త్ర దుకాణాల్లో ఉత్పత్తి చేసిన కంపెనీలకు సంబంధించిన ఎంఆర్‌పీ స్టిక్కర్లు మాత్రమే ఉండాలనే నిబంధనలు ఉన్నాయి. కానీ వాటిని తీసివేసి... సొంత ఎంఆర్‌పీ స్టిక్కర్లను పెడుతున్నారు. ఇది నేరం కూడా. కొన్ని చోట్ల కిలోల వంతున దుస్తులు అమ్ముతున్నారు. అసలు దుస్తుల నాణ్యత ఎంత? దానికి దుకాణ యజమాని ఎంత రేటు కట్టి విక్రయిస్తున్నారు? తూకం సరిగా ఉందా లేదా? అన్న విషయంపై సంబంధిత అధికారులు దృష్టి పెట్టడం లేదు.

ఆఫర్ మంచిదే కానీ..

వస్త్రాలు, గృహోపకరణాలు, ఇతర వస్తువులను పండగ సమయాల్లో తక్కువ ధరలు, ఆఫర్లతో విక్రయిస్తుంటారు. ఇవి సామాన్యులకు కొంత ఊరటనిచ్చే వేననడంలో సందేహం లేదు. అదే సమయంలో వీటి వెనుక చిన్నపాటి మాయాజాలమూ ఉంటోంది. ఆఫర్ల పేరుతో కొన్ని షాపుల యజమానులు నాసిరకం వస్త్రాలు, వస్తువులు అంటగడుతుంటారు. కొందరు చాలా కాలంగా షాపుల్లో ఎవరూ కొనుగోలు చేయకుండా వదిలేసిన వాటిని, కాలం చెల్లిన వాటిని విక్రయిస్తున్నారు. దీనిని గుర్తించలేని వినియోగదారులు మోసపోతున్నారు. ఆఫర్‌తో పాటు నాణ్యత కూడా అత్యవసరమని గుర్తించాలి. ఆఫర్‌పై ఆశతో నాణ్యతలేని వస్త్రాలు కొనుగోలు చేసి... ఇబ్బంది పడడకం కంటే...కాస్త భారమైనా అసలు ధర పెట్టి కొనుగోలు చేయడమే మేలన్న సంగతి గుర్తెరగాలి. ఎమ్మార్పీ ధర రూ.2 వేలుగా చూపించి... దానిని రూ.వెయ్యికే విక్రయిస్తారు. వాస్తవంగా దాని అసలు ధర రూ.వెయ్యి దాటి ఉండదనే విషయం తెలుసుకోవాలి. వ్యాపారి ఎవరైనా లాభం చూసుకునే రాయితీలు ప్రకటిస్తారు. సాధారణంగా రూ.100 లాభం వచ్చేచోట రూ.80 వచ్చేలా ఆఫర్ ఇస్తుంటామని, దీని వల్ల ఎక్కువ మొత్తంలో కొనుగోలు జరుగుతుందని..తద్వారా ఆదాయం వస్తుందని ఓ వ్యాపారి చెప్పారు.

భారీ స్థాయిలో వ్యాపారం

ఉత్తరాంధ్రులు ఎక్కువగా ఒడిశా, ఛత్తీస్‌గఢ్‌తో సంబంధ బాంధవ్యాలు కలిగి ఉంటారు. ఈ ప్రాంతీయులు ఎక్కువ ఆ రాష్ట్రాల్లో స్థిరపడ్డారు. అటు నుంచి కూడా ఇక్కడికే కొనుగోలుకు వస్తుంటారు. దీంతో మూడు రాష్ట్రాలకూ వ్యాపార పరంగా విజయనగరం కేంద్రంగా మారింది. డిసెంబరు మొదటి వారం నుంచే ఇక్కడ మార్కెట్‌లో సందడి మొదలవుతుంది. సంక్రాంతి వరకూ కొనసాగుతుంది. ఈ రెండు నెలల్లోనే విజయనగరం మార్కెట్‌లో రూ.800 కోట్ల నుంచి రూ.1000 కోట్ల వరకూ విక్రయాలు జరుగుతాయనేది ఒక అంచనా. జిల్లా వ్యాప్తంగా హోల్‌సేల్ దుకాణాలు 1000 వరకూ ఉండగా రిటైల్ షాపులు మరో 600 వరకూ ఉంటాయి. జ్యూయలరీ షాపులు 500 వరకూ ఉంటాయి. దీంతో కోట్లాది రూపాయల టర్నోవర్ జరుగుతుంటుంది.

నిత్యమూ భయమే

- ఏనుగులతో టెన్షన్
- భారీగా పంట నష్టం
- ఆదుకోవాలని కోరుతున్న రైతులు



వరి పంటను ధ్వంసం చేస్తున్న ఏనుగులు



ధ్వంసమైన అరటి తోట

గరుగుబిల్లి, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని సుంకి గ్రామానికి చెందిన రైతులకు ఏనుగుల గుంపు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. వీటి కారణంగా నిత్యం నష్టాల బారిన పడుతున్నారు. గత పది రోజులుగా పరిసర ప్రాంతాల్లో ఏనుగులు సంచరిస్తూ వరి, అరటి, పామాయిల్ పంటలతో పాటు వ్యవసాయ మోటార్లు, పైపులైన్లు, టీ దుకాణాలను ధ్వంసం చేస్తున్నాయి. అధికార యంత్రాంగం ప్రజలకు ప్రాణాపాయం లేకుండా కొంత మేరకు చర్యలు చేపడుతున్నా... పంట నష్టాలను నివారించే దిశగా తగిన జాగ్రత్తలు తీసుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. సోమవారం మరడాన సురేష్‌కు చెందిన వాల్‌జి బ్రిక్స్ పైపులతో పాటు ఇంటి తలుపులు, పైపులు, డ్రమ్ములను ధ్వంసం చేశాయి. డోకల రాములుకు చెందిన వ్యవసాయ పంపు సెట్లను పాడు చేశాయి. గొట్టిపల్లి సింహాచలం, రమేష్‌లకు చెందిన అరటి పంటను, మోటార్లను ధ్వంసం చేశాయి.

ఆ ప్రయత్నం ఫలిస్తుందా?

ఇదిలా ఉండగా మన్యం జిల్లా పరిధిలోని 11 ఏనుగుల గుంపును దారి మళ్లించేందుకు కుంకీ ఏనుగును రప్పించే చర్యలను అటవీ శాఖ అధికారులు చేపడుతున్నారు. సీతానగరం మండలంలోని గుచ్చిమి ప్రాంతంలో ప్రత్యేక క్యాంపు నిర్వహణకు అవసరమైన చర్యలు చేపడుతున్నారు. ఈ ప్రాంతంలో కుంకీ ఏనుగును ఉంచి మిగిలిన ఏనుగులను రప్పించేందుకు అవసరమైన అనుమతుల కోసం కేంద్ర ప్రభుత్వానికి నివేదికలు పంపించారు. డిజైన్లతో పాటు అవసరమైన సమాచారాన్ని నివేదించారు. క్యాంపు కార్యాలయానికి అవసరమైన నిధులు మంజూరైన వెంటనే తరలింపు ప్రక్రియ చేపట్టే యోచనలో ఉన్నట్టు తెలుస్తోంది. ఈలోగా ప్రజా జీవనానికి ఏనుగులతో ఇబ్బంది లేకుండా అధికార యంత్రాంగం చర్యలు చేపట్టాలని ఈ ప్రాంతీయులు కోరుతున్నారు.



ఏనుగులు విరగ్గొట్టిన తలుపులను చూపుతున్న సురేశ్



పోలమాంబను దర్శించుకుంటున్న మంత్రి సంధ్యారాణి

పోలమాంబ జాతర విజయవంతానికి కృషి

- గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి

మక్కువ, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్రుల ఆరాధ్యదేవత శంబర పోలమాంబ జాతర వచ్చే ఏడాది జనవరి 27, 28, 29 తేదీల్లో జరగనుంది. ఈ నేపథ్యంలో జాతర విజయవంతానికి అన్నిశాఖల అధికారులు కలిసికట్టుగా కృషి చేయాలని రాష్ట్ర గిరిజన శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి పిలుపునిచ్చారు. శంబర గ్రామంలో కలెక్టర్ శ్యాంప్రసాద్, ఎస్పీ మాధవరెడ్డి సమక్షంలో పోలమాంబ జాతర ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులతో సోమవారం ఆమె సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ముందుగా మంత్రి, కలెక్టర్, ఎస్పీలు పోలమాంబను దర్శించుకున్నారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు పక్కాగా చేయాలన్నారు. చదురుగుడి, వనంగుడి పరిసరాల చుట్టూ రూ.2.40 కోట్లతో ఆరు రహదారులు నిర్మించామని తెలిపారు. గ్రామాన్ని శుభ్రం చేసుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. వ్యర్థాలను వీధుల్లో పారబోయకుండా గ్రామస్తులు సహకరించాలని కోరారు. భక్తులకు ఇబ్బంది పెట్టకుండా పోలీసులు వ్యవహరించాలని సూచించారు. శంబర గ్రామానికి చేరుకొనే రహదారులకు పూర్తి స్థాయిలో మరమ్మతులు చేయాలని అధికారులకు మంత్రి సూచించారు. పండగ మూడు రోజులు ఆర్టీసీ బస్సులు పూర్తి స్థాయిలో నడపాలని ఆదేశించారు. వివిధ శాఖల అధికారులను ఏర్పాట్ల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం జాతరకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు వివిధ సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఈ సమావేశంలో సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, ఏఎస్పీ అంకిత సురాన, ఆలయ ఈవో వి.వి.సూర్యనారాయణ, ఎంపీటీసీ సభ్యుడు తీళ్ల పోలినాయుడు, సర్పంచ్ సింహాచలమ్మ, అక్కేన తిరుపతిరావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రూట్‌మ్యాప్ పరిశీలన

చదురుగుడి, వనంగుడి పరిసరాలకు సంబంధించిన రూట్‌మ్యాప్‌ను కలెక్టర్ శ్యాం ప్రసాద్, ఎస్పీ మాధవరెడ్డి, ఏఎస్పీ అంకిత సురాన సోమవారం పరిశీలించారు. భక్తులు త్వరగా అమ్మవారి దర్శనం చేసుకునేలా చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సాలూరు సీఐ రామకృష్ణ, ఎస్ఐ వెంకటరమణమూర్తి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



ఒకే మొక్క.. 39 బ్రహ్మ కమలాలు

బొబ్బిలి డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): బ్రహ్మ కమలం ఏడాదికి ఒకటి లేదా రెండు పూలు పూయడం సహజం. కానీ బొబ్బిలి పట్టణంలోని చర్చి సెంటరులో వ్యాపారి కొత్తా రాజా ఇంట్లో ఓ మొక్కకు ఏకంగా 39 బ్రహ్మ కమలాలు విరబూశాయి. సోమవారం తెల్లవారు జామున మొక్కను పరిశీలించగా.. ఒకేసారి 39 పూలు కనువిందు చేశాయని కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ పూలను స్థానికులు ఆసక్తిగా తిలకించారు.



అంతా ఒకేచోట కలిసి భోజనం చేస్తున్న రైతులు

కలసి తింటే.. కలదు సుఖం



విజయనగరం, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): కోడి కూయక ముందే లేచి... నాగలి భుజాన వేసుకొని... పొలం బాట పట్టే రైతన్నలు... శ్రమైక జీవన సౌందర్యానికి ప్రతీకలు. ఇరుగు పొరుగు వారు కలసి... ఒకరికొకరు చేదోడు వాదోడుగా ఉంటూ.. వ్యవసాయ పనులు చేయడం పల్లెల్లో సహజం. అంతే కాదండోయ్.. పరిసర పొలాల్లోని రైతులు, కూలీలు అందరూ కలసి ఒకేచోట భోజనాలూ చేస్తుంటారు. ఆహార పదార్థాలు పంచుకొని తింటుంటారు. ఈ దృశ్యాలు ఐక్యతకు చిహ్నంగా కనిపిస్తాయి. విజయనగరం జిల్లా నెల్లిమర్ల మండలం పినతరిమి రైతులు సోమవారం ఉదయం ఇదే తరహాలో కబుర్లు పంచుకుంటూ భోజనాలు చేస్తూ.. స్వచ్ఛతకు మారుపేరులా కనిపించారు.



చేతులు శుభ్రం చేసుకుంటూ...

ట్రేడ్ లైసెన్స్ తప్పనిసరి

విజయనగరం రింగురోడ్డు, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): నగరంలోని వ్యాపారులందరూ ట్రేడ్ లైసెన్సులు తీసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ పి.నల్లనయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజా రోగ్య సిబ్బంది ఇప్పటివరకూ ట్రేడ్ లైసెన్స్‌లు పొంద లేని వ్యాపారులకు అవగాహన కల్పించడంతో పాటు వారు లైసెన్స్‌లు పొందేలా చైతన్యం కలిగించాలని చెప్పారు.

స్పార్క్ పరీక్షకు స్పందన

లక్కవరపుకోట, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): సాహ సం ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం జిల్లావ్యాప్తంగా 8 కేంద్రాల్లో నిర్వహించిన స్పార్క్ టాలెంట్ టెస్టుకు విద్యార్థుల నుంచి మంచి స్పందన లభించింది. సుమారు 1500 మంది విద్యార్థులు పరీక్ష రాశారని ఫౌండేషన్ అధినేత మాచవరపు గణేష్ తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో 6 నుంచి 10 వరకు చదువుతున్న విద్యా ర్థులకు ఆరేళ్లుగా రాష్ట్రవ్యాప్తంగా పరీక్షలు నిర్వహిస్తు న్నామన్నారు. ఈ పరీక్షలో మొదటి మూడు స్థానాలకు పొందిదన వారికి ప్రైజ్‌మనీతో పాటు జ్ఞాపికలు, టీ షర్టులు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంఈవో కూటర్మారావు పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే కేసులు

రాజాం రూరల్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సర వేడుకలు సందర్భంగా ఈనెల 31న రాత్రివేళ శాంతి భద్రతలకు భంగం కలిగిస్తే కేసులు నమోదు చేస్తామని రాజాం టౌన్ సీఐ కె.అశోక్‌కుమార్ స్పష్టం చేశారు. ప్రశాంత వాతావరణంలో వేడుకలు జరుపుకోవాలని సూచించారు. టౌన్ సర్కిల్ కార్యాలయంలో సోమవారం సాయంత్రం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మద్యం తాగి వాహనాలు నడిపితే కేసు నమోదు చేసి వాహనాలను సీజ్ చేస్తామన్నారు. బహిరంగ ప్రదేశాలలో మద్యం తాగవద్దని, కేక్ కటింగ్‌లు వద్దన్నారు. రాత్రి 11 గంట్ల తరువాత అత్యవసర పరిస్థితుల్లో మినహా రోడ్డుపై తిరిగే వారిపై చర్యలు తీసుకుం టామన్నారు.ఆయనతో పాటు ఎస్ఐ కిరణ్ ఉన్నారు.

● శృంగవరపుకోట: నూతన సంవత్సర వేడుకల సం దర్భంగా శాంతిభద్రతలకు విఘాతం కలిగిచ్చోంద ని శృంగవరపుకోట సీఐ వి.నారాయణమూర్తి సోమవారం విడుదల చేసిన ప్రకటనలో కోరారు. మంగళవారం రాత్రి బహిరంగ ప్రదేశాల్లోను, రహదారులపైన కొత్త సంవత్సర వేడుకులు జరపరాదన్నారు. మద్యం సేవిం తాగి వాహనాలను నడపరాదన్నారు. డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదు చేస్తామన్నారు.

● నెల్లిమర్ల: నూతన సంవత్సర వేడుకలను శాంతియుతంగా నిర్వహించుకోవాలని ఎస్ఐ బి.గణేష్ సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. 31న రాత్రి బహిరంగ ప్రదేశాలు, రహదారులపై నూతన సంవత్సర వేడుకలను నిర్వహించరాదన్నారు.

సామాజిక కార్యక్రమాల్లో ముందుంటాం

కొత్తవలస, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): సామాజిక కార్యక్రమాలలో తమ కంపెనీ ముందుంటుందని కంటకాపల్లిలోని శారద మెటల్స్ అండ్ అల్లాయస్ కర్మాగార డీజీఎం సన్యాశిరావు, ఏజీఎం మనోజ్‌కుమార్ అన్నారు. సోమవారం రోడ్డుభద్రత, ట్రాఫిక్‌రూల్స్ పాటించడంపై పోలీసులతో కలిసి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అందులో భాగంగా ట్రాఫిక్ నియంత్రణ కోసం 10 సేఫ్టీ స్టాఫర్స్‌ను అందజేశారు. కార్యక్రమంలో సీఐ షన్ముఖరావు ఉన్నారు.

అమిత్‌షా వ్యాఖ్యలను ఖండించాలి

చీపురుపల్లి, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ నిర్మాత డా.అంబేడ్కర్‌పై అమిత్‌షా చేసిన అనుచిత వ్యాఖ్యలను రాష్ట్రంలోని కూటమి భాగస్వామ్య పార్టీలు ఖండించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు ఆ పార్టీ నాయకులు టి.వి.రమణ, అంబల్ల గౌరినాయుడు నేతృత్వంలో కార్యకర్తలు సోమవారం పట్టణంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఖండించాలన్నారు. ● కొత్తవలస: డా.అంబేడ్కర్‌ను అవమానిస్తూ వ్యాఖ్యలు చేసిన హోమ్ మంత్రి అమిత్ షా వెంటనే క్షమాపణ చెప్పాలని కులవివక్ష పోరాట సమితి డిమాండ్ చేసింది. కొత్తవలస జంక్షన్‌లోని అంబేద్కర్ కూడలి వద్ద సోమవారం నిరసన ప్రదర్శన చేపట్టారు. ● గజపతినగరం: డా.అంబేడ్కర్‌ను అవమానించి న కేంద్ర హోమ్ మంత్రి అమిత్‌షాను తక్షణమే బర్తరఫ్ చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యురాలు వి.లక్ష్మి అన్నారు. సోమవారం స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు.

ఘనంగా చండీ హోమం

విజయనగరం రూరల్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక రైల్వేస్టేషన్ వద్దనున్న పైడిమాంబ ఆలయంలో సోమవారం మూల నక్షత్రాన్ని పురస్కరించుకుని చండీ హోమాన్ని ఘనంగా నిర్వహించారు. వేదపండితుల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అలాగే మూడు లాంతర్ల వద్ద పైడిమాంబ చదురుగుడిలోనూ ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రెడ్‌క్రాస్ సాయం

సంతకవిటి, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): సిరిపురంలోని అగ్ని ప్రమాద బాధితులకు సోమవారం రెడ్‌క్రాస్ అండగా నిలిచింది. బాధితులకు వంట సామగ్రి, టార్పాలిన్లు, దోమతెరలు, చీరలు, తువ్వాళ్లు, దుప్పట్లను రెడ్‌క్రాస్ చైర్మన్ జగన్మోహనరావు సోమవారం అందజేశారు. కార్యక్రమంలో తహశీల్దార్ సత్యం, టీడీపీ నాయకుడు కోళ్ల అప్పలనాయుడు, రెడ్‌క్రాస్ ప్రతినిధులు సాయిప్రశాంత్ కుమార్ ఉన్నారు.

ఘనంగా ధనుర్మాస పూజలు



జామి, డిసెంబరు 30 (ఆంధ్ర జ్యోతి): భీమసింగిలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ధనుర్మాస పూజలు నిర్వహిస్తు న్నారు. సోమవారం గోదాదేవిని పల్లకిలో మహిళలు ఊరేగించారు.

ఉపాధి అవకాశాలను మెరుగుపర్చుకోండి

● రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్



మాట్లాడుతున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్

గజపతినగరం, బొండపల్లి, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం స్కిల్ డెవలప్‌మెంట్ ద్వారా కలిస్తున్న ఉద్యోగ, ఉపాధి అవకాశాలను యువత సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. సోమవారం స్థానిక సాయిసిద్ధార్థ కళాశాల ఆవరణలో నిర్వహించిన మెగా జాబ్‌మేళాను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 1.20 కోట్ల మంది యువకులు, 90 లక్షల మంది మహిళలు నిరుద్యోగులుగా ఉన్నట్టు సర్వేలో తేలిందన్నారు. ప్రతిఒక్కరూ ప్రభుత్వ ఉద్యోగాల కోసం వేచి చూడకుండా ప్రైవేట్ ఉపాధి అవకాశాల వైపు మొగ్గు చూపాలన్నారు. రాష్ట్రంలోని యువతకు నైపణ్యం లేకపోవడం వల్ల కియా మోటార్స్‌లో ఇతర రాష్ట్రాలకు చెందిన యువత ఉపాధి పొందే పరిస్థితులు నెలకొన్నాయన్నారు. కూటమి ప్రభుత్వం యువతకు నైపుణ్య శిక్షణ ప్రాధాన్యమిస్తోందని, వెయ్యి మందికి ప్రైవేట్ కంపెనీల్లో ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో జాబ్‌మేళా నిర్వహించామన్నారు. కార్యక్రమంలో మేళా నిర్వహకులు కోట్ల సుగుణాకరరావు, కళాశాల కరస్పాడెంట్ శీరరెడ్డి చంద్రశేఖర్, జనసేన నాయకులు మర్రాపు సురేష్, బీజేపీ రాష్ట్ర నాయకులు పావని, మాజీ ఎంపీపీలు గంట్యాడ శ్రీదేవి, బెజవాడ రాజేశ్వరి, జడ్పీటీసీ మాజీ సభ్యుడు మక్కువ శ్రీధర్, బీజేపీ రాష్ట్ర నాయకురాలు రెడ్డి పావని, దత్తిరాజేరు, గంట్యాడ టీడీపీ అధ్యక్షులు చప్ప చంద్రశేఖర్, కొండపల్లి భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు. ఇంటర్వ్యూలకు 417 మంది హాజరు కాగా 221 మంది ఎంపికైనట్టు కళాశాల కరస్పాండెంట్ చంద్రశేఖర్ తెలిపారు. హెట్రో కంపెనీలో 112 మందికి ఉద్యోగ అవకాశాలు దక్కాయన్నారు.

ఉన్నత శిఖరాలకు చేరుకోండి


విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే లలితకుమారి

శృంగవరపుకోట, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): పోటీ ప్రపంచంలో ఉన్నత శిఖరాలకు ఎదిగేందుకు విద్యార్థి దశ నుంచే పునాదులు వేసుకోవాలని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి అన్నారు. ఈమేరకు సోమవారం శృంగవరపుకోట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన వైజ్ఞానిక ప్రదర్శనకు ఆమె ముఖ్యఅతిథిగా విచ్చేశారు. విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్ట్‌లను తిలకించి, వారిని అభినందించారు. ఆమెతో పాటు మండల పార్టీ అధ్యక్షుడు జి.ఎస్. నాయుడు, నాయకులు కాపుగంటి వాసు, ఎంఈవో నరసింగరావు జి.వి.రమణ, ఎంపీపీ సండి సోమేశ్వరరావు, సర్పంచ్ సంతోషికుమారి ఉన్నారు.

లక్కవరపుకోట: వివిధ రకాల ప్రాజెక్టుల తయారీలో విద్యార్థులు సృజనాత్మకత చాటి అందరినీ అబ్బురపరిచారు. ఈమేరకు సోమవారం ఏపీ మోడల్ స్కూల్‌లో నిర్వహించిన మండల స్థాయి నదరన్ ఇండియా సైన్స్‌ఫేర్‌లో స్థానిక పాఠశాల విద్యార్థులు తమ ప్రాజెక్ట్‌లను ప్రదర్శించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి హాజరై ప్రాజెక్ట్‌లను తిలకించారు. కార్యక్రమంలో జిల్లా మోనటరింగ్ టీమ్, ఎంఈవో కూర్మారావు, శ్రీనివాస రావు, జడ్పీటీసీ మాజీ సభ్యుడు కరెడ్ల ఈశ్వరరావు తదితరులున్నారు.

భోగాపురం: స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌లో సోమవారం నిర్వహించిన మండల స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌ను ఎమ్మెల్యే నాగమాధవి ప్రారంభించారు. విద్యార్థులను ఆమె అభినందించారు.

హాస్టల్‌లో ఆకస్మిక తనిఖీ


వసతిగృహాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

పూసపాటిరేగ, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక సాంఘిక సంక్షేమ వసతి గృహాన్ని ఎమ్మెల్యే లోకం నాగమాధవి సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వసతి గృహం నిర్వహణ, వసతులను ఆమె పరిశీలించారు. వసతి గృహంలో భోజన సదుపాయం, సమస్యలపై ఆమె విద్యార్థులతో మాట్లాడారు. మరుగుదొడ్ల నిర్వహణపై అసంతృప్తి వ్యక్తం చేశారు. సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడతానని హామీ ఇచ్చారు. అనంతరం సమీపంలోని ఉన్నత పాఠశాలను సందర్శించారు. కార్యక్రమంలో సంక్షేమ అధికారి శరన్మయి, హెచ్ఎం బలివాడ శంకరరావు ఉన్నారు.

భోగారావుకు సాహితీ పురస్కారం


పురస్కారం అందుకున్న దృశ్యం

విజయనగరం రూరల్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): విజయనగరానికి చెందిన పప్పు భోగారావుకు తటపర్తి స్మారక సాహితీ పురస్కారం లభించింది. ఈనెల 29న విశాఖ లో నిర్వహించన కార్యక్రమంలో పురస్కారాన్ని భోగారావుకు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా సెంచూరియన్ యూనివర్సిటీ వీసీ జి.ఎస్.ఎన్.రాజు, జిల్లాకు చెందిన రచయితలు, సాహితీవేత్తలు, ప్రముఖులు ఆయన్ని అభినందించారు.

భోజన కార్మికుల సమస్యలను పరిష్కరించండి

శృంగవరపుకోట, డిసెంబర్ 30 (ఆంధ్రజ్యోతి) మధ్యాహ్న భోజన పథక నిర్వాహకుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ నాయకుడు మద్దిల రమణ కోరారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో భోజన నిర్వాహకులతో కలసి వినతి పత్రం అందించారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటర్ల జాబితా విడుదల

● ఆరు జిల్లాల్లో 21,555 మంది ఓటర్లు
● పురుషులు 12,948, మహిళలు: 8,607
● అత్యధికంగా విశాఖ జిల్లాలో 5,277 మంది ఓటర్లు
● 2019 కంటే 1,968 మంది అధికం

విశాఖపట్నం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటర్ల తుది జాబితా సోమవారం ఎన్నికల అధికారి, విశాఖ జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ తుది జాబితా విడుదలచేశారు. ఆరు జిల్లాల పరిధిలో 21,555 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో 12,948 మంది పురుషులు కాగా 8,607 మంది మహిళలు. అత్యధికంగా విశాఖ జిల్లాలో 5,277 మంది, విజయనగరం జిల్లాలో 4,937, శ్రీకాకుళం జిల్లాలో 4,829, అనకాపల్లి జిల్లాలో 2,802, పార్వతీపురం మన్యంలో 2,262 మంది, అల్లూరి సీతారామరాజు జిల్లాలో 1,448 మంది టీచర్లు ఓటర్లుగా నమోదయ్యారు. 2019లో జరిగిన ఎన్నికల్లో ఓటర్ల సంఖ్య 19,587. ఈ పర్యాయం స్వల్పంగా పెరిగారు.

వచ్చే ఏడాది మార్చిలో జరగనున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు ఈ ఏడాది సెప్టెంబరు 30వ తేదీ నుంచి ఓటర్ల నమోదు ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. గత నెల 23న ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల చేసి అభ్యంతరాలు స్వీకరించారు. ఆ ప్రక్రియ ముగియడంతో సోమవారం ఎన్నికల అధికారి తుది జాబితా విడుదల చేశారు. గత నెల 23న విడుదల చేసిన ముసాయిదా జాబితాలో 15,297 మంది ఓటర్లు ఉండగా అభ్యంతరాలు స్వీకరించడంతోపాటు కొత్త ఓటర్ల నమోదుకు అవకాశం ఇచ్చారు. ఈ సందర్భంగా 19 మంది ఓటర్లపై అభ్యంతరాలు రాగా వారిని ఓటర్ల జాబితా నుంచి తొలగించారు. కొత్తగా పురుషులు 3,325, మహిళలు 2,962 మంది వెరసి 6,287 మంది దరఖాస్తు చేయగా పరిశీలించి అందరినీ ఓటర్ల జాబితాలో చేర్చారు. ఇదిలావుండగా వచ్చే ఏడాది ఎన్నికల నోటిఫికేషన్ విడుదల తరువాత మరోసారి ఓటర్ల నమోదుకు ఎన్నికల సంఘం అవకాశం ఇవ్వనున్నది.

తుది ఓటర్ల జాబితా

జిల్లా	పురుషులు	మహిళలు	మొత్తం
శ్రీకాకుళం	3,275	1,554	4,929
విజయనగరం	3,100	1,837	4,937
పార్వతీపురం మన్యం	1,532	730	2,262
అల్లూరి సీతారామరాజు	891	557	1,448
విశాఖపట్నం	2,403	2,874	5,277
అనకాపల్లి	1,747	1,055	2,802
మొత్తం	12,948	8,607	21,555

సమస్యలను తక్షణమే పరిష్కరించండి

విజయనగరం క్రైం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పోలీసు స్టేషన్ల పరిధిలోని బాధితుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఎస్పీ వకుల్ జిందాల్ పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీ సు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో 19 ఫిర్యాదులను ఎస్పీ స్వీకరించారు. ఫిర్యాదుదారులతో స్వయంగా ఆయన మాట్లాడి సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చారు. ఫిర్యాదుల పూర్వాపరాలను విచారణ చేసి చట్ట పరిధిలో చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐలు శంకరరావు, లీలారావు, ఆర్.వి.ఆర్.కె.చౌదరి, ఎస్ఐ రాజేష్ పాల్గొన్నారు.

హత్య కేసులో వ్యక్తికి జీవిత ఖైదు

విజయనగరం క్రైం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని గంట్యాడ పోలీసు స్టేషన్ పరిధిలో 2023లో నమోదైన హత్య కేసులో నిందితుడైన గంట్యాడ మండలం తాటిపూడి గ్రామానికి చెందిన పడాల సత్యనారాయణకు జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.సాయికల్యాణ్ చక్రవర్తి జీవిత ఖైదుతో పాటు రూ.2500 జరిమానా విధిస్తూ సోమవారం తీర్పు వెల్లడించారని ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. పడాల సత్యనారాయణ అదే గ్రామానికి చెందిన పడాల వరలక్ష్మితో వివాహం జరిగింది. కొంత కాలం తర్వాత ప్రతిరోజు మద్యం తాగి భార్యతో గొడవపడేవాడు. దీంతో భార్య. పిల్లలను తీసుకుని పుట్టింటికి వెళ్లింది. గత ఏడాది ఏప్రిల్ 18న సత్యనారాయణ తన కుటుంబసభ్యులతో కలిసి అత్తారింటికి వెళ్లాడు. అక్కడ భార్య అత్తమామలతో గొడవపడ్డాడు. అదే సమయంలో మామ తామాడ అప్పలస్వామిపై కత్తితో దాడి చేసి హత్య చేశాడు. బాధితుల ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్ఐ గణేష్ కేసు నమోదు చేశారు. అప్పటి రూరల్ సీఐ, తిరుపతిరావు, సింహాద్రినాయుడు దర్యాప్తు చేపట్టి నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. న్యాయస్థానంలో అభియోగపత్రాలు దాఖలు చేశారు. కేసులో ఎ-2 నింది తుడు పడాల సత్యం మరణించగా, ఎ-1 పడాల సత్యనారాయణ మామను హత్య చేసినట్టు నేరం రుజువు కావడంతో జిల్లా ప్రధాన న్యాయమూర్తి.. సత్యనారాయణకు శిక్ష ఖరారు చేస్తూ తీర్పు వెల్లడించారని ఎస్పీ తెలిపారు. నిందితుడికి త్వరితగతిన శిక్ష పడే విధంగా వ్యవహరించిన దర్యాప్తు అధికారులు, ప్రాసిక్యూషన్ అధికారులను ఎస్పీ అభినందించారు.

చికిత్స పొందుతూ లారీ క్లీనర్ మృతి

చీపురుపల్లి, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): కర్లాం కోళ్ల పరిశ్రమ వద్ద ఈ నెల 25న లారీ నుంచి జారి పడి చికిత్స పొందుతున్న లారీ క్లీనర్ డి.రమణ(36) ఆదివారం రాత్రి మృతి చెందారు. హెచ్‌సీ రమణ అందించిన సమాచారం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. సాలూరు ప్రాంతానికి చెందిన రమణ, కర్లాం కోళ్ల పరిశ్రమకు కోళ్ల మేత లోడుతో ఈ నెల 25న వచ్చారు. మేతను అన్‌లోడ్ చేసే ప్రక్రియలో లారీ నుంచి జారి కింద పడిపోయారు. దీంతో తలకు బలమైన గాయాలు కావడంతో చీపురుపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో తొలుత ప్రథమచికిత్స అందించారు. అనంతరం విజయనగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మరణించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు హెచ్‌సీ రమణ తెలిపారు.

గంజాయితో నలుగురి అరెస్టు

కొత్తవలస, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): గంజాయితో పాటు నలుగురు వ్యక్తులను సోమవారం అరెస్టు చేసినట్టు ఎస్ఐ సుదర్శనరావు తెలిపారు. కొత్తవలస సంత మార్కెట్ షెడ్ వద్ద గంజాయితో నలుగురు వ్యక్తులు ఉన్నారనే సమాచారం మేరకు దాడి చేశామన్నారు. పోలీసులను చూసి పారిపోవడానికి యత్నించడంతో వారిని సిబ్బంది పట్టుకున్నారన్నారు. నిందితులు కొత్తవలస గ్రామానికి చెందిన సుడిశెట్టి రవితేజ, వంక అరుణ్‌కుమార్, కడగళ్ల ఆదిత్యబాలాజీ, కొసిరెడ్డి రాంబాబుగా గుర్తించామన్నారు. వీరు నలుగురు గతకొంత కాలం కిందట గంజాయి తాగడానికి అలవాటు పడ్డారన్నారు. అరుకులోని గుర్తు తెలియని వ్యక్తుల నుంచి గంజాయి కొనుగోలు చేసి, తాము కొంత వినియోగించి మిగిలిన గంజాయిని విక్రయిస్తుంటామని చెప్పారన్నారు. వీరి నుంచి 2.700 కిలోల గంజాయిని తహశీల్దార్ సమక్షంలో స్వాధీనం చేసుకుని నలుగురిపై సీఐ షణ్ముఖరావు కేసు నమోదు చేశారని, వారిని రిమాండ్ నిమిత్తం తరలించినట్టు తెలిపారు.

పరిహారం త్వరితగతిన అందించండి

విజయనగరం క్రైం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): హిట్ అండ్ రన్ కేసుల్లో బాధితులకు నష్టపరిహారం త్వరితగతిన అందిస్తేనే సత్వర న్యాయం చేసినట్టవుతుందని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి టి.వి.రాజేష్‌కుమార్ అన్నారు. సోమవారం అదనపు సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో మోనటరింగ్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నష్టపరిహారం అందించడంలో ఆలస్యం జరగకూడదన్నారు. అధికారులు సమన్వయంతో ముందుకు సాగాలన్నారు. ఈ సందర్భంగా పరిహారం చెల్లింపుల్లో ఆలస్యానికి గల కారణాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో రెండు జిల్లాల రెవెన్యూ, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ సేవలు అభినందనీయం


మాట్లాడుతున్న ఎస్పీ

గరివిడి, డిసెంబర్ 30(ఆంధ్రజ్యోతి): గరివిడిలో నిర్వహిస్తున్న ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ సెంటర్ సేవలు అభినందనీయమని ఎస్పీ వకుల్ జిందాల్ అభినందించారు. సోమవారం రాత్రి 7 గంటల సమయంలో సెంటర్‌ను ఎస్పీ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూగ, చెవిటి తదితర ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు సెంటర్ ద్వారా ఉచితంగా వసతి, భోజనం, చదువులు చెప్పడం మంచి పరిణామమన్నారు. కార్యక్రమంలో చీపురుపల్లి డీఎస్పీ రాఘవులు, సీఐ శంకరరావు, శ్రీరామ్ లయన్స్ క్లబ్ ప్రతినిదులు శర్మ, టి.కమలాకరరావు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులు పూర్తిచేయండి

విజయనగరం కలెక్టరేట్, డిసెంబరు30 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పల్లెపండుగ కార్యక్రమంలో చేపట్టిన మెటీరియల్ కాంపోనెంట్ పనులను త్వరగా పూర్తిచేయాలని కలెక్టర్ అంబేడ్కర్ ఆదేశించారు. వివిధ శాఖకు జిల్లా అధికారులు, ఎంపీడీవోలు, పంచాయతీరాజ్ అధికారులతో సోమవారం సాయంత్రం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంజూరైన పనులలో ఇప్పటి వరకూ 442 పూర్తయ్యాయని, జనవరి 14 నాటికి అన్ని పనులు పూర్తి చేయాలన్నారు. లేయర్ పనులుకు రోజుకి వంద చొప్పున పూర్తి చేసి లక్ష్యాన్ని సాధించాలని సూచించారు. ఇప్పటికి వరకూ జరిగిన పనులకు త్వరలోనే బిల్లులు చెల్లిస్తామన్నారు. ఒక్క రోజు ముందు పింఛన్లు పంపిణీ నిర్వహించాలన్నారు. మొదటి రోజే శతశాతం పింఛన్లు పంపిణీ చేయాలని ఆదేశించారు. వీలైతే ప్రజా ప్రతినిధుల చేతులు మీదుగా పింఛన్లను పంపిణీ చేయాలని సూచించారు.

ఎమ్మెల్సీ ఓటర్ల జాబితా ప్రదర్శన

నెల్లిమర్ల, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): వచ్చే ఏడాది మార్చిలో జరుగునున్న ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఓటర్ల తుది జాబితాను స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఎన్నికల విభాగం డీటీ జగన్నాథరావు సోమవారం నోటీసు బోర్డులో వేలాడదీశారు. కార్యక్రమంలో హెచ్‌డీటీ రవిశంకర్, సీనియర్ అసిస్టెంట్ ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

రాజాం: ఎమ్మెల్సీ ఓటరు జాబితాను రాజాం రెవెన్యూ కార్యాలయంలో సోమవారం ఎన్నికల డీటీ ప్రకాశ్ విడుదల చేశారు. కొత్తగా 313 ఓట్లు నమోదు కాగా అందులో పురుషులు 207, మహిళల 106 మంది ఉన్నారన్నారు. కార్యక్రమంలో ఏఎస్‌వో బాలమురళీ, ఆర్ఐ సాగర్ తదితరులున్నారు.

బొకేలు, పూలమాలలు తేవద్దు

రాజాం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా బొకేలు, పూలమాలలు, శాలువలు తీసుకురావద్దని చీపురుపల్లి ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు సూచించారు. ఈమేరకు సోమవారం ఆయన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. టీడీపీ కుటుంబసభ్యులు, కూటమి నాయకులు, అభిమానులు, శ్రేయోభిలాషులకు ముందుగా నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. గరివిడిలోని కేవీఆర్ కల్యాణ మండపంలో, చీపురుపల్లిలో నిర్వహించే సంవత్సర వేడుకల్లో భాగంగా తనను కలిసేందుకు వచ్చేవారు ఏమీ తీసుకు రావద్దన్నారు. బొకేలు, పూలమాలలు, శాలువలు తీసుకురావాలనుకునే వారు అదే ఖర్చుతో పేద విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు అందించాలని ఆయన సూచించారు.

అలరించిన మ్యూజికల్ నైట్

గరివిడి, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): గరివిడిలో సహాయ్ స్వచ్ఛంద సంస్థ, సంగీత స్వర మాధురి సంయుక్తంగా ఆదివారం రాత్రి నిర్వహించిన మ్యూజికల్ నైట్ నాడు-నేడు కార్యక్రమం అందరినీ అలరించింది. 30 మంది కళాకారులు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం, ఘంటసాల పాటలను ఆలపించారు. కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థ సభ్యులు వాకాడ శ్రీను, యు.శ్రీను, వాకాడ గోపి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళాకారులను ఘనంగా సత్కరించారు.

కళాకారులను సత్కరిస్తున్న దృశ్యం →



వినతుల పరిష్కారంలో కొత్త ఒరవడి

● అర్జీదారులకే నేరుగా కలెక్టర్ ఫోన్


మాట్లాడుతున్న కలెక్టర్ అంబేడ్కర్

విజయనగరం కలెక్టరేట్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికకు సంబంధించిన వినతుల పరిష్కారం ఎలా ఉందో తెలుసుకునేందుకు కలెక్టర్ డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ వినూత్న ప్రయత్నం చేశారు. అర్జీదారులు అందజేస్తున్న వినతులు వారు సంతృప్తి చెందే రీతిలో పరిష్కారం అవుతున్నాయా? లేదా అని తెలుసు కునేందుకు కలెక్టర్ అంబేడ్కర్ వారితోనే మాట్లాడారు. మీకోసం కార్యక్రమం నుంచే వారికి ఫోన్ చేసి సంబంధిత ప్రభుత్వ శాఖ సమస్యను పరిష్కారం చేసే తీరుపై సంతృప్తిగా ఉన్నారా? లేదా అనే అంశాన్ని తెలుసుకునే ప్రయత్నం చేశారు. వివిధ ప్రభుత్వ శాఖలు వినతులు పరిష్కరించినట్టుగా ఇచ్చిన నివేదికలపై సోమవారం పరిష్కార వేదిక నుంచి ఆయా వినతులు అందజేసిన అర్జీదారులతో ఫోన్‌లో మాట్లాడి, వినతుల పరిష్కారంపై సంతృప్తి చెందారా లేదా అన్న విషయాన్ని తెలుసుకున్నారు. ముగ్గురు అర్జీదారులతో నేరుగా మాట్లాడగా, వారంతా తమ వినతులు సంతృప్తికరమైన రీతిలో పరిష్కారమయ్యాయని, సమస్యల పరిష్కారంపై సంతృప్తిగా ఉన్నామని కలెక్టర్‌కు బదులిచ్చారు.

ప్రజా సమస్యలపై 137 వినతులు

కలెక్టరేట్ ఆడిటోరియంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యలు పరిష్కార వేదిక కార్యక్రమంలో కలెక్టర్ అంబేడ్కర్ 137 వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యలు పరిష్కార వేదికకు అందిన వచ్చే ప్రతి వినతికి అర్జీదారుడు సంతృప్తి చెందే రీతిలో సమస్యను పరిష్కరించడమే లక్ష్యంగా జిల్లా అధికారులు పనిచేయాలని ఆదేశించారు. అర్జీదారుల సమస్యను పూర్తిగా విని దాన్ని పరిష్కరించే ప్రయత్నం చేయాలన్నారు. కలెక్టర్‌తో పాటు జేసీ సేతు మాధవన్, డీఆర్‌వో శ్రీనివాసమూర్తి వినతులను స్వీకరించారు. వినతుల్లో రెవెన్యూ శాఖకు సంబంధించి 82, మున్సిపల్ శాఖకు 20, డీఆర్‌డీఏ 10 అందాయి.

సమర్థ పోలీసింగ్‌తో నేరాలు తగ్గుముఖం

● 2025లోనూ ఇదే ఒరవడి కొనసాగిస్తాం
● ఎస్పీ వకుల్ జిందాల్


మాట్లాడుతున్న ఎస్పీ వకుల్ జిందాల్

విజయనగరం క్రైం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు శాఖ సమర్థమైన పోలీసింగ్‌తో 2024లో నేరాలు తగ్గుముఖం పట్టాయని ఎస్పీ వకుల్ జిందాల్ అన్నారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో 2024 పోలీసు శాఖ సాధించిన ప్రగతి, ఛేదించిన కేసుల వివరాలను ఆయన వెల్లడించారు. 2024లో గంజాయి నియంత్రణ, మహిళల ఆఘాయిత్యాలపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించామన్నారు. ఇదే ఒరవడితో 2025లో కూడా ముందుకు వెళ్తామన్నారు. పోక్సో నేరాల్లో నిందితులు శిక్షించే విధంగా చర్యలు చేపట్టామన్నారు. 2023లో 19 శాతం మహిళలపై జరిగిన ఆఘాయిత్యాలపై కేసులు నమోదు కాగా, 2024లో ఒక్క కేసు మాత్రమే నమోదు అయ్యిందన్నారు. అలాగే వరకట్న వేధింపులు, అత్యాచార కేసులు, కిడ్నాపింగ్ కేసులు తగ్గుముఖం పట్టాయన్నారు. పోక్సో కేసులు 2023లో 58 నమోదు కాగా, 2024లో 54 కేసులు నమోదు అయ్యాయన్నారు. 12 కేసుల్లో నిందితులకు 20 ఏళ్ల కంటే ఎక్కువగా జైలు, 10 ఏళ్ల కంటే ఎక్కువగా మూడు కేసుల్లో, ఐదేళ్ల ఎక్కువగా శిక్షలు పడ్డాయన్నారు. రహదారి భద్రతకు అత్యంత ప్రాదాన్యత ఇచ్చామన్నారు. ఎంవీ నిబంధనలు అతిక్రమించే వారిపై, మద్యం సేవించి వాహనం నడిపేవారిపై కేసులు నమోదు చేశామన్నారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు 2023లో 73 నమోదు కాగా, 2024లో 63 కేసులు నమోదు అయ్యాయన్నారు. సైబర్ నేరాలు సంఖ్య 2023 108 కేసులు నమోదు కాగా, 2024లో 107 కేసులు నమోదు అయ్యాయన్నారు. డిజిటల్ అరెస్టులు పెరిగాయని, ప్రజల్లో అవగాహన కల్పించేందుకు వీడియోలు రూపొందించి, అవగాహన కల్పిస్తున్నామన్నారు. మిస్సింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. గంజాయి అక్రమ రవాణాదారులపై 81 కేసు నమోదు చేసి, 247 మందిని అరెస్టు చేసి 2,152.39 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నామన్నారు. పశువులు, ఇసుక అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపామన్నారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు ప్రత్యేక ప్రాధాన్యత ఇచ్చామని, 2024లో 1907 ఫిర్యాదులు స్వీకరించి 1,667 ఫిర్యాదులు పరిష్కరించామన్నారు. 2025 కూడా ఇదే ఒరవడిని కొనసాగిస్తామని ఎస్పీ తెలిపారు. సమావేశంలో ఏఎస్పీ సౌమ్యలత ఉన్నారు.

ఫ్రీహోల్డ్‌పై నోరెత్తలేదు!

(3వ పేజీ తరువాయి)

గ్రామ రెవెన్యూ సదస్సులో అధికారులు ప్రస్తావించకపోవడం అందరినీ విస్తు గొలిపింది. విమర్శలకు తావిచ్చింది.

జాయింట్ పట్టాదారుల్లో వీడని ఆందోళన

కేజీపూడి గ్రామంలో ప్రభుత్వ భూములు ఎక్కువున్నాయి. ఇదే స్థాయిలో భూమి లేని కుటుంబాలకు కొదవ లేదు. దీనికి తోడు గిరిజన కుటుంబాలు అత్యధికంగా వున్నాయి. మూడు దశాబ్దాలల క్రితమే ఈ గ్రామంలో భూమి లేని ఎస్సీ, ఎస్టీ, బీసీలకు డి.పట్టాలు ఇచ్చారు. అయితే ఈ పట్టాలు ఇచ్చేసమయంలో రెండు కుటుంబాలకు ఎవరో ఒకరిపేరున పట్టాలు ఇచ్చారు. సాగులో రెండు కుటుంబాలు వున్నప్పటికీ పట్టాలు ఒకరిపేరున ఇచ్చారు. అయితే జాయింట్ పట్టాదారుల్లో సాగులో వున్న మరో కుటుంబం ఆందోళనకు గురవుతోంది. పట్టాపై పేరున్నవారు అమ్మేసుకున్నారేమోనని భయపడుతున్నారు. జాయింట్ పట్టాను విడదీసి ప్రత్యేకంగా తాము సాగు చేస్తున్న భూమికి పట్టా ఇవ్వాలని కోరుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు.

పాపం ఆమెకు తెలియదు

ఓ మహిళా రైతు ఇటీవల కలెక్టర్‌కు పెట్టుకున్న విన్నపంలో పొందుపరిచిన సర్వే నెంబర్ అసైన్డ్ భూమిని ఫ్రీహోల్డ్ చేసేశారు. వేరే వ్యక్తికి రిజిస్ట్రేషన్ కూడా జరిగిపోయింది. ఫ్రీహోల్డ్ రిజిస్ట్రేషన్‌లో ఆ సర్వే నెంబర్ కూడా కనిపిస్తోంది. ఈ విషయం తెలియని ఆ మహిళా రైతు తాము సాగు చేస్తున్న పొలానికి జాయింట్ పట్టాను విడదీసి ప్రత్యేక పట్టా ఇవ్వాలని కోరుతోంది.

బియ్యం బొక్కేస్తున్నారు

(3వ పేజీ తరువాయి)

గ్రామంలోని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గిడ్డంగుల సంస్థ గోదాముల్లో ఈ తంతు జరుగుతున్నట్లు గుర్తించే కొన్ని ఫొటోలు బయటపడ్డాయి. అక్కడ రైసు మిల్లర్ల నుంచి సేకరించిన బియ్యంతో పాటు ప్రభుత్వం కొనుగోలు చేసే మొక్కజొన్న నిల్వలు కూడా ఉన్నాయి. ప్రస్తుతం వేలాది సంఖ్యలో బియ్యం బస్తాలు నిల్వ ఉండడంతో వాటిలో నుంచి వేల కిలోల బియ్యం కాజేసి రాత్రి వేళల్లో ప్రైవేట్ వ్యక్తులకు గుట్టుచప్పుడు కాకుండా అక్రమ మార్గంలో అమ్మకాలు చేస్తున్నారు. ఈ విషయమై గోదాం మేనేజరు కె.అప్పారావును వివరణ కోరగా గోదాంలో బియ్యం నిల్వచేయడం మినహా బస్తాల నుంచి బియ్యం తస్కరించడం, రాత్రి సమయాల్లో వాటిని తరలించడం లాంటి వ్యవహారాలు జరగడం లేదన్నారు. మాకు అర్డర్లు వస్తే నిల్వలు తరలించడం తప్పా ఇంకేమి జరగదన్నారు.

సైబర్ ఉచ్చులో మరొకరు

(3వ పేజీ తరువాయి)

పోగొట్టుకోవడం చర్చనీయాంశంగా మారింది. రాజాం టౌన్ సీఐ కె.అశోక్‌కుమార్ అందించిన వివరాలిలా ఉన్నాయి.

రాజాంలోని కేర్ హాస్పిటల్ ప్రాంతానికి చెందిన కురిమేటి వెంకట దేవీప్రసాద్ రాజాం టౌన్‌లోని బొబ్బిలి జంక్షన్‌లో గిఫ్ట్ ఆర్టికల్ షాపు నిర్వహిస్తున్నాడు. రెండు గంటల్లో రూ.5 లక్షలు రుణం ఇస్తామని ఆధార్, పాన్‌కార్డుతో పాటు రిజిస్ట్రేషన్ ఫీజుగా రూ.3200 చెల్లించాలని నాలుగు రోజుల క్రితం దేవీప్రసాద్‌కు ఫోన్‌కాల్ వచ్చింది. దీంతో సైబర్ నేరగాడు చెప్పిన అకౌంట్‌కు దేవీప్రసాద్ రూ.3200 జమచేశాడు. సిబిల్‌స్కోర్ తక్కువగా ఉందని రూ.30 వేలు చెల్లించాలని మరోమారు సూచించాడు. తాను అంతమొత్తం చెల్లించలేనని దేవీప్రసాద్ స్పష్టం చేయడంతో రూ.15 వేలు చెల్లిస్తే రూ.2 లక్షలు రుణం ఇస్తామని రుణం ఇస్తామన్న వ్యక్తి ఫోన్‌లో సూచించాడు. నగదు అత్యవసరం కావడంతో పాటు ఎలాంటి సెక్యూరిటీ లేకుండా రుణం వస్తుందన్న ఆశతో రూ.15 వేలు అకౌంట్‌లో వేశాడు. అక్కడితో ఆగకుండా రూ.5 లక్షలు రుణం మంజూరైంది కాబట్టి ఖచ్చితంగా రూ.30 వేలు చెల్లించాలని లేకుంటే ఇప్పటివరకూ చెల్లించిన నగదు పోతుందని మరోమారు నమ్మబలికాడు. దీంతో మరో రూ.15 వేలు సైబర్ నేరగాడు చెప్పిన ఖాతాకు దేవీప్రసాద్ జమ చేశాడు. రుణం కావాలంటే ఒకేసారి రూ.30 వేలు జమ చేయాలని, అలా చేస్తే ఇప్పటివరకూ రెండుసార్లు వేసిన రూ.30 వేలు తిరిగి మీఖాతాకు జమ చేస్తామని స్పష్టం చేయడంతో మరో రూ.30 వేలు ఫోన్‌పే చేశాడు. అక్కడితో ఆగకుండా రుణం పెంచుతామని, మరికొంత మొత్తం వేయాలని స్పష్టం చేస్తూ వచ్చాడు. అడిగిన మొత్తం వేయకపోతే ఇప్పటివరకూ చెల్లించిన మొత్తం తిరిగి రాదని, రుణం కూడా వచ్చే అవకాశం ఉండదన్న ఆలోచనతో దేవీప్రసాద్ మూడురోజుల పాటు దపదపాలుగా ఫోన్‌పే, పేటీఎం, గూగుల్ పే అకౌంట్లకు రూ.8,95,900 జమచేశాడు. అయినాసరే ఇస్తామన్న రుణం ఇవ్వలేదు సరికదా ఫోన్ స్విచ్ఛాఫ్ రావడంతో తాను మోసపోయానని గుర్తించి సోమవారం రాజాం పోలీసుల్ని ఆశ్రయించాడు. రాజాం టౌన్ సీఐ కె.అశోక్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఏడాది సెప్టెంబరు 18న రాజాం పట్టణంలోని తెలగవీధికి చెందిన ఓ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ సైతం సైబర్ మాయగాళ్ల ఉచ్చులో పడి రూ.7.50 లక్షలు మోసపోయిన సంగతి పాఠకులకు విదితమే.

అమిత్‌షాపై చర్యలు తీసుకోవాలి



నిరసన దీక్షలో పాల్గొన్న వామపక్షాల నాయకులు

బొబ్బిలి, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): బీఆర్ అంబేడ్కర్ పట్ల అవమానకరమైన వ్యాఖ్యలు చేసిన కేంద్రమంత్రి అమిత్‌షాపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ బొబ్బిలి ఎన్టీఆర్ జంక్షన్‌లో వామపక్షాల ఆధ్వర్యంలో సోమవారం నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఈసందర్భంగా సీపీఎం, సీపీఐ, పట్టణ కళాసీ సంఘం, సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ, రైతు కూలీ సంఘం, ఎంఆర్‌పీఎస్, ఐద్వా సంఘాల నాయకులు పాల్గొని నినాదాలు చేశారు.

నిలిచిన గ్రామీణ బ్యాంకు సేవలు

- అవస్థలు పడిన ఖాతాదారులు
- రేపటి నుంచి పునఃప్రారంభం



భామినిలో గ్రామీణ వికాస్ బ్యాంకు

గరుగుబిల్లి/ భామిని, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ వికాస్ బ్యాంకు సేవలు తాత్కాలికంగా నిలిపి వేయడంతో ఖాతాదారులు అవస్థలు పడుతున్నారు. గతంలో ఉభయ రాష్ట్రాల పరిధిలో బ్యాంకు సేవలు అందేవి. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం ఒకే రాష్ట్రం, ఒకే గ్రామీణ బ్యాంకు ఏర్పాటు చేస్తున్న నేపథ్యంలో విభజన ప్రక్రియ ఏర్పాటు చేస్తున్నారు. తెలంగాణాతో అనుబంధం లేకుండా కేవలం ఆంధ్రప్రదేశ్‌లో పరిమితం కానున్నాయి. ఈ నేపథ్యంలో సాంకేతిక సమస్యల కారణంగా ఈనెల 31వ తేదీ వరకు బ్యాంకు సేవలు అందుబాటులో ఉండవని గరుగుబిల్లి శాఖ మేనేజర్ వీవీఆర్ రెడ్డి తెలిపారు. గ్రామీణ వికాస్ బ్యాంకు పరిధిలోని లావాదేవీలతో పాటు మొబైల్ బ్యాంకింగ్, యూపీఐ, ఏటీఎం, ఖాతాదారుల సేవా కేంద్రాలతో పాటు పలు సౌకర్యాలు నిలుపుదల చేశామని చెప్పారు. మెరుగైన సేవలందించేందుకు చేపడుతున్న మార్పులను ఖాతాదారులు గ్రహించాలన్నారు. రాష్ట్రంలో తదుపరి ఏపీ గ్రామీణ వికాస్ బ్యాంకు పేరుతోనే కార్యక్రమాలు కొనసాగుతాయన్నారు. ● ఈనెల 28వ తేదీ నుంచి బ్యాంకింగ్ సేవలను నిలిచిపోయాయని భామిని గ్రామీణ వికాస్ బ్యాంకు మేనేజర్ కె.సాంబిరెడ్డి తెలిపారు. వచ్చే నెల ఒకటో తేదీ నుంచి విధిగా బ్యాంకు సేవలు కొనసాగుతాయని చెప్పారు.

ఆ కేసులను తక్షణమే పరిష్కరించాలి

- ఎస్సీ, ఎస్టీ అత్యాచారాలపై స్పందించండి
- మంత్రి కొండపల్లి శ్రీనివాస్



మాట్లాడుతున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్

విజయనగరం, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎస్సీ, ఎస్టీ అత్యాచారాలపై నమోదైన కేసులు తక్షణమే పరిష్కరించాలని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఆదేశించారు. కలెక్టరేట్ ఆడిటోరియంలో జిల్లా స్థాయి విజిలెన్స్ మోనటరింగు కమిటీ సమావేశం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎస్సీ, ఎస్టీ వర్గాల అభివృద్ధి... సంక్షేమానికి ప్రభుత్వం అంకితభావంతో పనిచేస్తోందన్నారు. కలెక్టర్ అంబేడ్కర్ మాట్లాడుతూ, ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో ఆకమించిన శ్మశాన భూములను గుర్తించి 15 రోజుల్లో నివేదిక ఇవ్వాలని ఆర్డీవోకు సూచించారు. ఈ సమస్యలపై స్థానిక ఎస్ఐ, తహసీల్దారు, సర్వేయర్ ముగ్గురు కలిసి తనిఖీలు నిర్వహించాలన్నారు. ప్రతి నెల 30న మండలస్థాయిలో సివిల్ రైట్స్ డేని జరుపుతున్నామన్నారు. కోర్టులో 250 కేసులు పెండింగ్‌లో వున్నాయని, వీటిని సత్వరమే డిస్పోజల్ అయ్యేలా చూడాలని పబ్లిక్ ప్రాసిక్యూటర్‌ని కోరారు. అందుకు అవసరమైన సాక్ష్యాలను వేగంగా సమర్పించాలని పోలీసులకు సూచించారు. ఎస్పీ వకుల్‌జిందాల్ మాట్లాడుతూ, జిల్లాలో ఎస్సీ, ఎస్టీకి సంబంధించి 27 కేసులు నమోదు అయ్యాయని, 4 డీఎస్పీలు విచారణ జరుపుతున్నారన్నారు. 9 కేసులకు నెంబరు పడిందని, మూడు కేసులు రిఫర్ చేయడం జరిగిందని, 15 కేసులు విచారణలో వున్నాయని, 60 రోజుల్లో చార్జిషీట్ ఫైలు చేయడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. సమావేశంలో జేసీ సేతు మాధవన్, సభ్యులు చిట్టిబాబు, సూర్యనారాయణ, రామస్వామి, సన్యాసిరావు, గణపతి తదితరులు పాల్గొన్నారు.

చెత్తాచెదారం పోసేవారిపై చర్యలు తీసుకోవాలి

బొబ్బిలి, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో విచ్చలవిడిగా చెత్తాచెదారం పారబోసే వారిని గుర్తించి, వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ లాలం రామలక్ష్మి శానిటరీ, ఎన్విరాన్‌మెంట్ సిబ్బందిని ఆదేశించారు. స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి రాజా కళాశాల రోడ్డు, విద్యుత్ కార్యాలయం, గొల్లవీధి తదితర ప్రాంతాలను ఆమె సోమవారం పర్యటించారు. ఆయా ప్రాంతాల సమస్యలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. పలు చోట్ల మురుగు నీరు పేరుకుపోవడం, చెత్తాచెదారాలు ఉండడంతో ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. వాటన్నిటినీ తక్షణం తొలగించాలని సిబ్బందిని ఆదేశించారు. మురుగునీరు ప్రవాహానికి ఆటంకం కలిగేలా ఎక్కడైనా ఆక్రమణలను ఉంటే వెంటనే వాటిని తొలగించాలన్నారు. చెత్తాచెదారాలకు కారకులైన వారికి అపరాధ రుసుం విధించాలన్నారు. ఖాళీ స్థలాల యజమానులకు నోటీసులను జారీ చేయాలని ఆమె ఆదేశించారు. ఆమె వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్ మురళి, మేస్త్రీలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మెప్మా బజారులో రూ.30వేల అమ్మకాలు



మెప్మా బజారును పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ రామలక్ష్మి

బొబ్బిలి, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): మెప్మా మిషన్ ఆదేశాల మేరకు ప్రతి నెలా నిర్వహించే అర్బన్ మార్కెట్ (మెప్మా బజారు)కు మంచి స్పందన లభించింది. స్థానిక మున్సిపల్ కార్యాలయం ఆసుపత్రిలో సోమవారం ఏర్పాటు చేసిన మెప్మా బజారును మున్సిపల్ కమిషనర్ లాలం రామలక్ష్మి ప్రారంభించి, అందులో సామగ్రిని పరిశీలించారు. ఉత్పత్తుల తయారీదారులు, మహిళా వ్యాపారులతో మాట్లాడారు. 50 మహిళా సమాఖ్యల నుంచి మహిళలు 80 యూనిట్లను ఏర్పాటు చేశారు. ఒక్కరోజు రూ.30వేల వ్యాపారం చేశారు. మహిళలు వ్యాపార నిర్వహణలో రాణిస్తే సమాజంలో మంచి గౌరవ మన్ననలు పొందగలరని కమిషనర్ ఈసందర్భంగా వారిని ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో టీపీఆర్‌వో జగన్మోహన్, సీఎంఎం లలిత, సీవోలు పోలినాయుడు, సింహాచలం, అరుణజ్యోతి, వరలక్ష్మి ఆర్‌పీలు, ఎస్‌హెచ్‌సీ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా విద్యా వైజ్ఞానిక ప్రదర్శన

బొబ్బిలి, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి పట్టణంలోని గొల్లపల్లి శ్రీవేణుగోపాల మున్సిపల్ హైస్కూలులో సోమవారం మండల స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించారు. ఇందులో ఉత్తమమైన ప్రాజెక్టులను ఎంపిక చేసి, విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. మండల విద్యా శాఖాధికారులు చల్లా లక్ష్మణరావు, గొట్టాపు వాసు, నోడల్ హెచ్‌ఎం వి.మల్లేశ్వరరావు, నోడల్ టీచర్లు ఎస్.శ్రీనివాసరావు, ఎ.శ్రీనివాసరావుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు

- బొబ్బిలి డీఎస్పీ శ్రీనివాసరావు



మాట్లాడుతున్న బొబ్బిలి డీఎస్పీ శ్రీనివాసరావు

రామభద్రపురం, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): బొబ్బిలి సబ్ డివిజన్ పరిధిలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని బొబ్బిలి డీఎస్పీ పి.శ్రీనివాసరావు తెలిపారు. వార్షిక తనిఖీల్లో భాగంగా సోమవారం సాయంత్రం ఆయన రామభద్రపురం పోలీసుస్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం తాగి వాహనం నడిపితే రూ.10వేల జరిమానా విధిస్తామన్నారు. గంజాయిని నిర్మూలించేందుకు కొట్టక్కి వద్ద చెక్‌పోస్టు ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ ఏడాది సుమారు 850 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. రోడ్డు ప్రమాదాల నివారణకు బ్లాక్ స్పాట్స్ గుర్తించి, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. అనంతరం రికార్డులు తనిఖీ చేశారు. పోలీస్‌స్టేషన్ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచడంలో రామభద్రపురం ఎస్ఐ వెలమల ప్రసాద్ పనితీరును మెచ్చుకున్నారు. ఇటీవల జేసీబీ చోరీ కేసును బొబ్బిలి రూరల్ సీఐ కె.నారాయణరావు ఎంతో చాకచక్యంగా ఛేదించారని అన్నారు. బొబ్బిలి సీఐ నారాయణరావు, ఎస్ఐ వెలమల ప్రసాద్ పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో వేడుకలు వద్దు

బాడంగి/ రామభద్రపురం, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): బహిరంగ ప్రదేశాలు, రహదారులపై నూతన సంవత్సర వేడుకలు నిర్వహించరాదని బొబ్బిలి రూరల్ సీఐ కె.నారాయణరావు తెలిపారు. రామభద్రపురం పోలీసుస్టేషన్‌లో సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. 31వ తేదీ రాత్రి 11గంటలు దాటిన తర్వాత రహదారులపై ఎవరు తిరగరాదని హెచ్చరించారు. రాష్ డ్రైవింగ్, బైకు రేసులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి జంక్షన్ వద్ద పోలీసుల బృందం పహారా కాస్తుందని చెప్పారు. బహిరంగ ప్రదేశాల్లో కేక్‌లు కట్ చేయడం, పార్టీలు నిర్వహించడం, డిజే లౌడ్ స్పీకర్లు ఏర్పాటు చేయడం చట్టరీత్యా నేరమని తెలిపారు. ప్రజలకు ఇబ్బంది కలగకుండా ప్రతిఒక్కరూ నూతన సంవత్సర వేడుకలు జరుపుకోవాలన్నారు. మందుగుండు సామగ్రి కాల్చకూడదని, యువతులను ఈవ్‌టీజింగ్ చేయకూడదని సూచించారు. నూతన సంవత్సర వేడుకల్లో ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని కోరారు.

హద్దు మీరితే చర్యలు తప్పవు

బొబ్బిలి, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సర వేడుకలను అందరూ సరదాగా చేసుకోవాలని, హద్దులు దాటితే కఠిన చర్యలు తప్పవని బొబ్బిలి సీఐ కటకం సతీష్‌కుమార్ హెచ్చరించారు. సోమవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. రానున్న నూతన సంవత్సరం అందరికీ ఆనందాన్ని పంచి పెట్టాలని ఆకాంక్షిస్తున్నామని తెలిపారు. ట్రిపుల్ రైడింగ్, అతివేగం, మద్యం తాగి వాహనాలు నడపడం నేరమని, అలాంటి వారిపై నిఘా పెట్టామని చెప్పారు. బహిరంగ ప్రదేశాల్లో వేడుకలకు అనుమతించబోమని స్పష్టం చేశారు. పెట్రోలింగ్ బృందాలు మంగళవారం సాయంత్రం నుంచి రాత్రంతా పట్టణంలో గస్తీ తిరుగుతాయని చెప్పారు. ముఖ్య కూడళ్లలో పోలీసు పికెట్స్ ఏర్పాటు చేస్తామన్నారు.

కేంద్ర మంత్రిని కలిసిన ఎమ్మెల్యే బేబీనాయన



కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడికి పులుల చిత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే బేబీనాయన

బొబ్బిలి, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): కేంద్ర విమానయాన శాఖా మంత్రి కింజరాపు రామ్మోహననాయుడును సోమవారం శ్రీకాకుళంలోని ఆయన క్యాంపు కార్యాలయంలో బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయన మర్యాద పూర్వకంగా కలిశారు. తాను తీసిన పులుల ఫొటోను కేంద్రమంత్రికి బహూకరించారు. అనంతరం బొబ్బిలి ప్రాంత సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. టీడీపీ నాయకులు అల్లాడ భాస్కరరావు, నర్సుపల్లి వెంకటేశ్, బేతనపల్లి కృష్ణమూర్తి ఉన్నారు.

విద్యార్థులకు స్క్రీనింగ్ పరీక్షలు

బొబ్బిలి రూరల్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): పిరిడి జడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం ఆర్‌బీఎస్‌కే జిల్లా ప్రోగ్రాం వైద్యాధికారి వి.సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి భరద్వాజ్ విద్యార్థులకు స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. రాష్ట్రీయ బాల్ స్వాస్థ్య కార్యక్రమం కింద 18 ఏళ్ల లోపు పిల్లలలో పుట్టుకతో వచ్చే లోపాలను ముందుగానే గుర్తించేందుకు ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ పాఠశాలలోని ప్రతి విద్యార్థికీ ఈ పరీక్షలు నిర్వహించాలని తెలిపారు. ఏవైనా జన్యులోపాలు, వ్యాధులు ఉంటే వారి వివరాలను ఆరోగ్య కార్యకర్తలు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు సంబంధిత యాప్‌లో నమోదు చేయాలని సూచించారు. ఏఎన్‌ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా ప్రదర్శన

బొబ్బిలి రూరల్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ ఎమ్మెల్సీ తుది జాబితాలో మొత్తం 775 మంది ఓటర్లు ఉన్నారని తహసీల్దార్ ఎం.శ్రీను సోమవారం ప్రకటించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బొబ్బిలి నియోజకవర్గం తుది జాబితాను నోటీసు బోర్డులో పొందుపరిచామన్నారు. ఇందులో పురుషులు 542, మహిళలు 233 మంది ఉన్నారనీ, బొబ్బిలి ఓటర్లు 564, రామభద్రపురం 78, బాడంగి 57, తెర్లాం 76 మందిగా ఉన్నట్లు తెలిపారు. ఆర్ఐ రామ్‌కుమార్ పాల్గొన్నారు.

ఉమ్మడి రాష్ట్రాల ఐఎన్‌టీయూసీ ఉపాధ్యక్షుడిగా సాయికృష్ణ

బొబ్బిలి, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి పట్టణానికి చెందిన విద్యుత్ ఉద్యోగుల సంఘం సీనియర్ నాయకుడు బలగ సాయికృష్ణను ఆంధ్రప్రదేశ్- తెలంగాణ రాష్ట్రాల ఐఎన్‌టీయూసీ ఉపాధ్యక్షుడిగా నియమించారు. ఈ మేరకు ఆలిండియా ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు జి.సంజీవరెడ్డి సోమవారం హైదరాబాద్‌లో సాయికృష్ణకు నియామక ఉత్తర్వులను అందజేశారు. ఈసందర్భంగా ఐఎన్‌టీయూసీ నాయకులు, విద్యుత్ సంఘం-327 నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

12న జిల్లా స్థాయి కోలాటం పోటీలు

బొబ్బిలి/బొబ్బిలి రూరల్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): స్వామి వివేకానంద జయంతి సందర్భంగా జనవరి 12 తేదీన ఏబీవీపీ వివేకానంద సేవా సమితి ఆధ్వర్యంలో బొబ్బిలి యాదవ వీధిలో జిల్లా స్థాయి కోలాటం పోటీలు నిర్వహిస్తామని సమితి అధ్యక్షుడు ప్రగడ సత్యనారాయణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పోటీలలో కూచిపూడి, భరతనాట్యం తదితర పోటీలు ఉంటాయని చెప్పారు. పోటీల్లో పాల్గొనదలచినవారు ఎన్.మాధవరావు(8074689682), పారిచర్ల ధనుంజయ (9642706923)లను సంప్రదించాలని ఆయన ప్రకటనలో పేర్కొన్నారు.

న్యూస్ బాక్స్

ఒక రోజు ముందుగానే..

- నేడు పింఛన్ల పంపిణీ

పార్వతీపురం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లను మంగళవారం పంపిణీ చేస్తున్నట్టు కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు ఆయన సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్టీఆర్ సామాజిక పింఛన్లను ఒక రోజు ముందుగానే పంపిణీ చేయడానికి నిర్ణయం తీసుకుందని, ఈ మేరకు 31వ తేదీన పంపిణీ చేస్తున్నామని చెప్పారు. జిల్లాలో రూ. 59.25 కోట్ల పింఛన్లగా పంపిణీ చేయనున్నట్టు తెలిపారు.

సైబర్ నేరాలపై అవగాహన

కురుపాం, డిసెంబరు30(ఆంధ్రజ్యోతి): స్థానిక గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో సోమవారం కురుపాం పోలీసులు సైబర్ నేరాలు, మత్తు పదార్థాల వినియోగం వల్ల వచ్చే అనర్థాలు, రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఏఎస్ఐ నరసింహులు మాట్లాడుతూ విద్యార్థులు సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు.

జాతీయ స్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు యశోదమ్మ

సాలూరు రూరల్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): సివిల్ సర్వీసెస్ జాతీయ స్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు మామిడిపల్లికి చెందిన సర్లంగి యశోదమ్మ ఎంపికైనట్టు కోచ్ పి.శ్రీరాములు సోమవారం తెలిపారు. ఇటీవల జరిగిన రాష్ట్ర స్థాయి సివిల్ సర్వీసెస్ బ్యాడ్మింటన్ పోటీల్లో ఆమె ప్రతిభ చూపి, జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారని చెప్పారు. జాతీయ స్థాయి పోటీలు వచ్చే ఏడాది జనవరి 3 నుంచి 8 వరకు న్యూఢిల్లీ త్యాగరాజా ఇండోర్ స్టేడియంలో జరగనున్నాయన్నారు. ఆమె ప్రస్తుతం సాలూరు మండలం కందులపథం గ్రామ సచివాలయం ఏఎన్ఎంగా పనిచేస్తోంది.

బీసీలకు అండగా ప్రభుత్వం

గరుగుబిల్లి, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): బీసీలకు కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తుందని టీడీపీ అరకు బీసీ విభాగం ఛైర్మన్ బూరాడ రామ్‌మోహన్‌రావు అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర నూతన చీఫ్ సెక్రటరీగా బీసీ వర్గానికి చెందిన విజయనంద్‌ను నియమించడంపై హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబును సోమవారం కలిసి కృతజ్ఞతలు తెలియజేసినట్టు చెప్పారు.

పది పింఛన్ల మంజూరు

సీతానగరం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలో కొత్తగా పది పింఛన్లు మంజూరైనట్టు ఎంపీడీవో పి.త్రివిక్రమరావు తెలిపారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. గతంలో పింఛన్లు అందుకుంటూ మృతిచెందిన పురుషుల పింఛన్లను రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన మార్గదర్శకాల మేరకు వాళ్ల భార్యలకు మంజూరైనట్టు తెలిపారు. ఈనెల 31వ తేదీన రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ పింఛన్లను పంపిణీ చేస్తామని చెప్పారు. అలాగే గడిచిన రెండు, మూడు నెలల పింఛన్ల సొమ్మును తీసుకోని వారికి కూడా ఈనెల పింఛన్‌తో కలిపి ఇస్తామని ఆయన తెలిపారు.

వారం రోజులుగా విద్యుత్ కట్

- జిల్లా కేంద్ర వాసులకు అవస్థలు

పార్వతీపురంటౌన్, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): మన్యం జిల్లా కేంద్రంలో గల చేపల, కాయగూరల మార్కెట్‌లో గత వారం రోజులుగా విద్యుత్ సరఫరా నిలిపివేశారు. దీనిపై షాపుల వ్యాపారులు మున్సిపల్ అధికారుల వద్ద మొర పెట్టుకున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. సోమవారం కూడా సంబంధిత ఇంజనీరింగ్ విభాగం ఏఈ సన్యాసిరావుకు ఫిర్యాదు చేశారు. విద్యుత్ సరఫరా పునరుద్ధరించకపోతే రేపటి నుంచి మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతామన్నారు.

చర్యలు తీసుకుంటాం

దీనిపై ఏఈ సన్యాసరావు స్పందిస్తూ సంబంధిత అధికారులతో మాట్లాడి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించే విధంగా చర్యలు చేపడతామని తెలిపారు.